శంకుస్థాపనతో సరి.. పట్టించుకోవాలి మరి

- ఫ్రైజర్‌పేట వాటర్ ట్యాంక్ రిటైనింగ్ వాల్ దుస్థితి
- ఏడాదిన్నర క్రితం వర్షాలకు కుప్పకూలిన రిటైనింగ్ వాల్
- నాచుపట్టిన మెట్లమార్గంలో నిత్యం ప్రమాదాలు
- శంకుస్థాపన తర్వాత కదలని పనులు



కృపానందం వీధిలో కూలిన రిటైనింగ్ వాల్



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49వ డివిజన్ ఫ్రైజర్‌పేట కృపానందం వీధిలోని వాటర్ ట్యాంక్ రక్షణ గోడ ఏడాది క్రితం వర్షాలు, డ్రెయిన్‌జీ నీరు కారణంగా అడుగుభాగం దెబ్బతిని ఒక్క సారిగా కుప్పకూలి రాళ్లు, మట్టిచరియలు కింది నివాసాల మీద పడ్డాయి. ఈ ఘటనలో స్థానిక మహిళ ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకోవడంతో ప్రజలు ఊపిరిపిల్చుకున్నారు. విషయం తెలియడంతో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి స్థానికులతో మాట్లాడి యుద్ధ ప్రతిపాదికన వాటర్ ట్యాంక్ రక్షణ గోడ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇది జరిగి ఏడాదిన్నర దాటినా నేటికి రక్షణ గోడ నిర్మించలేదు. దీంతో ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలతో ప్రజలు భయందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నారు.

శిథిలావస్థలో రక్షణ గోడ..

సుమారు 60 ఏళ్ల క్రితం ఫ్రైజర్‌పేటలోని కృపానందం వీధి కొండ ప్రాంతంలో భూగర్భ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి దాని చుట్టూ కొండ రాళ్లతో రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రహరీని అనుకొని కొండ ప్రాంతం నుంచి సైడు డ్రెయిన్ కూడా చేపట్టడంతో డ్రెయిన్ నీరు, వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో నీటి ప్రవాహంతో రక్షణ గోడలకు తరచూ పగుళ్లు ఏర్పడి మురుగు నీరు స్థానిక నివాసాల మీదుగా పారుతుండేది. దీంతో అధికారులు అప్పుడప్పుడు చిన్నపాటి మరమ్మతులు చేపట్టి సరిపెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగారిగా రిటైనింగ్ వాల్ కుప్పకూలింది.

పనులు ఎప్పుడు..?

గత మే నెలలో రూ.77.27 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన అయితే చేశారు. ఆ తర్వాత పనులు మర్చిపోయారు. దీంతో ప్రతిరోజు ఆ వీధిలో డ్రెయిన్ పొంగి మెట్ల మార్గం గుండా మురుగునీరు పారటంతో అవి నాచుపట్టి అనేక మంది జారిపడి గాయాలపాలవుతున్నారు. అటుగా రాకపోకలు సాగించేందుకు తీవ్ర భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరతిగతిన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదంలో గాయపడ్డాను..



ఏడాదిన్నర క్రితం కృపానందంవీధిలో రిటైనింగ్ వాల్ కూలినా ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు. దీంతో కొండ ప్రాంతంలోని మెట్ల మార్గంలో మురుగునీటి ప్రవాహం కారణంగా నాచుపట్టి అడుగు వేస్తే జారి పడి గాయాలపాలవుతున్నాం. ఇటీవల నడుచుకుంటూ వస్తుండగా నాచుపట్టిన మెట్ల కారణంగా పడి గాయపడ్డాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరతగతిన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలి.

– గాలి విక్టోరియారాణి, ఫ్రైజర్‌పేట

పనులు పూర్తి చేయాలి..



కృపానందంవీధిలో రిటైనింగ్‌వాల్ కూలి ఏడాదిన్నర కావస్తున్నా అధికారులు ఇప్పటికి సమస్యను పరిష్కరించలేదు. దీనిపై అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు చేయడంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు చేపడతామని చెప్పారు. నెలలు గడుస్తున్నా ఒక్క పని కూడా చేపట్టలేదు. దీంతో ప్రతి రోజు ఎంతో మంది ఇక్కడ రాకపోకల సమయంలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తిచేయాలి.

– దారివేముల మరియమ్మ, ఫ్రైజర్‌పేట

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 33/11 కేవీ భవానీపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని పాత హెచ్‌ఐజీ, ఎంఐజీ బ్లాకులు, వెంకటేశ్వర ఫౌండ్రీ, టీచర్స్ కాలనీ, అప్నాబజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ఫ్లాట్స్, 450 ఎస్‌ఎఫ్‌టీ ఫ్లాట్స్, దర్గా ఏరియా, అవుట్ ఏజెన్సీ, ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి వీధి, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్, స్వాతి థియేటర్ రోడ్, ఎంపీ దాస్ వీధి, పోపూరివారి వీధి, గుడివాడ రామారావు వీధి, మానవ మందిరం రోడ్, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, ఎంఐజీ బ్లాక్-1,2, ఎల్ఐజీ, బైపాస్ రోడ్, ఐరన్ యార్డ్, పడమటివారి రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

రామరాజ్యనగర్ సెక్షన్‌లో...

రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ పున్నమి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ శంకర మఠం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రవీంద్రబాబు తెలిపారు. శనివారం ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు టంటంవారి వీధి, అండిమాని బ్రహ్మయ్య వీధి, కామకోటినగర్, పార్థసారథి రోడ్, సంజయ్ గాంధీ కాలనీ, గురుకృప రోడ్, సిమెంట్ రోడ్, అరవింద వీధి, జవహర్ వీధి, టీవీ కృష్ణారావు వీధి, లొల్లావారి వీధి, యద్దనపూడివారి వీధి, గంజి యలమందయ్య వీధి, అప్పలస్వామి క్వారీ ఎదురు కేసీ పబ్లిక్ స్కూల్ ఏరియా, భారత్ గ్యాస్ కంపెనీ ఏరియా, ఆర్కే పబ్లిక్ స్కూల్ ఏరియా, బీరువాల కంపెనీ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆటోలో ప్రయాణికురాలిపై దాడి.. కేసు నమోదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ చేతికి ఉన్న బంగారు గాజును లాక్కొని పారిపోయే యత్నం చేసిన వ్యక్తి, అతని అనుచరులపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ పెట్రోల్ బంక్ దగ్గర కొర్రపాటి మీనా కుమారి తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటోంది. ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ఆమె శుక్రవారం ఉదయం 9 గంటలకు చిట్టినగర్‌లో ఆటో ఎక్కి పాముల కాలువ దగ్గర దిగింది. అక్కడ నుంచి కొత్తూరు తాడేపల్లికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తుండగా వైవీ రావు ఎస్టేట్ రింగ్ వైపు నుంచి వస్తున్న ఆటో ఎక్కింది. ఆ ఆటోలో అప్పటికే ఓ మహిళ, ఓ పురుషుడు ఉన్నారు. ఆటో బెనెడిక్ట్ స్కూల్ దగ్గరకు వచ్చేసరికి ఆటోలో ఆమెకు ఎదురుగా కూర్చున్న వ్యక్తి ఉన్న బంగారు గాజును లాక్కొని దిగి పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఆటో డ్రైవర్ స్థానికుల సహాయంతో జెట్టిపాటి శ్రీనివాసరావు(42), జెట్టిపాటి యేసు మణి(48), బందారు ఏడుకొండలు(60)ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీనివాస్ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత ప్రభుత్వ కీర్తి చక్ర పురస్కార గ్రహీత, తెలుగు తేజం, నిస్వార్థ సేవకుడు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ జయంతి కార్యక్రమం శుక్రవారం భవానీపురంలో జరిగింది. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రాష్ట్రాలను గడగడలాడించిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను మొట్టమొదటి సారిగా అదుపులోకి తీసుకున్న యువ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ అన్నారు. వీరప్పన్ స్వగ్రామంలో ప్రజలు స్మగ్లింగ్ వైపు వెళ్లకుండా ఆ గ్రామంలో పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించటం, అలాగే వారి ఉపాధికి కుటీర పరిశ్రమలను తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసి ఆదర్శనీయుడిగా నిలిచారన్నారు. రామారావు, బుజ్జి, ఏవీఎస్ఎన్ ప్రసాద్, వెంకటేశ్వరరావు, టి.పూర్ణయ్య, టి.ప్రమీల, పార్వతి, అమృత, ఎం.మోజెస్, కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో 'సంకల్ప్ 2025'

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో సంకల్ప్ 2025 పేరుతో రెండు రోజుల సదస్సు జరిగింది. సైన్స్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ అంశంపై ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ అతిథులు హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సెంటిక్ గ్లోబల్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రభ వడ్లమాని, యూఎస్ఏలోని ప్యూర్ సీఈఓ డాక్టర్ శైల తల్లూరి పాల్గొని కృత్రిమ మేధస్సు టూల్స్, ఉద్యోగ మార్కెట్ గురించి, మెషిన్ లెర్నింగ్ గురించి వివరించారు.

ఆహార దుకాణాలన్నింటినీ మూసేయండి



పటమట(విజయవాడతూర్పు): కొత్త రాజరాజేశ్వరి పేటలో గల ఆహార దుకాణాలన్నిటినీ మూసేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్త రాజరాజేశ్వరిపేటలో ఆయన పర్యటించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 56, 57, 58 డివిజన్లో 11 సచివాలయాల పరిధిలో గల ప్రతి ఒక్కరికి శుద్ధమైన తాగునీరు బబుల్స్, టాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, ఆ నీరును కాచి చల్లార్చి మాత్రమే తాగాలని, 11 సచివాలయాలకు కేటాయించిన 11 స్పెషల్ ఆఫీసర్లు ప్రతి ఒక్కరికీ అతిసార వ్యాధి రాకుండా నివారణ చర్యల గురించి అవగాహన కల్పించాలన్నారు. నగర పరిధిలోని ఆర్వో ప్లాంట్ ద్వారా నీటి సరఫరా వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్, బీఎస్ఐ సర్టిఫికేషన్ ఉండాలని, లేకపోతే వారి దుకాణాలను మూసేయాలని, చికెన్, మటన్, ఆహార దుకాణాలన్నీ మూసివేయాలని ఆదేశించారు. హోటళ్లకి కూడా ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలని, లైసెన్స్ లేకపోతే వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంచేదే అక్షరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కేశవరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనలోని అజ్ఞానాన్ని తొలగించి వివేచన జ్ఞానాన్ని పెంచేది అక్షరమేనని, అక్షర జ్ఞానం లేనివారు చాలా విషయాల్లో వెనుకబడుతున్నారని విద్యా వికాస వాహిని అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని గొల్లపల్లి నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్‌లో విద్యా వికాస వాహిని, పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షర యజ్ఞం కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ అక్షర జ్ఞానం లేని తల్లిదండ్రులకు చదువుకుంటున్న వారి పిల్లల ద్వారానే అక్షరాలు నేర్పే కార్యక్రమమే అక్షర యజ్ఞమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. సాయంత్రం వేళల్లో విశ్రాంతిగా ఉన్న తల్లిదండ్రులకు రోజుకు ఒక పదాన్ని నేర్పిస్తూ ఆరు నెలల్లో వారు పుస్తకాలు చదివే స్థాయికి తీసుకువెళ్లవచ్చునని పేర్కొన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్వీఎస్ గణేష్ మాట్లాడుతూ.. అక్షర యజ్ఞం కార్యక్రమం పాఠశాలకు గర్వకారణంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అక్షరాలను నేర్పేందుకు అవసరమైన నోట్ పుస్తకాలు, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే రచనలను అందజేశారు. అలాగే గతేడాది నిర్వహించిన ఆన్‌లైన్ పీసీ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన జాహ్నవి, శశాంకలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యా వికాస వాహిని సభ్యులు లక్ష్మణరావు, వర్మ, ఉపాధ్యాయులు ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతోనే విజయాలు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే విజయాలను అందుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీఎస్ఆర్ అరవింద్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజమెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ది ఆర్ట్ ఆఫ్ ఫస్ట్ ఇంప్రెషన్ అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరవింద్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు భవిష్యత్‌లో తమ వృత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించే సందర్భంలో మొదటి ముద్ర చాలా ముఖ్యమన్నారు. వ్యక్తిగత శైలి, దుస్తులు, సంభాషణ నైపుణ్యం, శరీర భాష తదితర అంశాలు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూల్లో మొదటి ఐదు నిమిషాల్లో వ్యక్తిత ప్రదర్శన వారి విజయానికి కీలకమవుతుందన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో విజయం సాధించటానికి అవసరమైన నైపుణ్యాల పెంపుదల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, అధ్యాపకులు చంద్రశేఖరరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 69 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలోని 2వ, 5వ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 69 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. వారిని 6వ అడిషనల్ జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి లెనిన్‌బాబు 12 మందికి రూ.15 వేలు చొప్పున, 57 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

దేశ ఐక్యత కోసం పాటుపడిన ఏచూరి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ దేశ ఐకత్య కోసం సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాంఏచూరి పాటుపడ్డారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజానీకం ముందుకు రావాలని ఆయన కోరారు. విజయవాడ పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ బొమ్మ సెంటర్‌లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎమర్జెన్సీ వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కార్మిక రైతు దేశ లౌకిక రాజ్యం పరిరక్షణ ఉద్యమాల్లోనూ ఏచూరి పాత్రను కొనియాడారు. కేంద్రంలో మోదీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు భారాలు వేస్తోందని తెలిపారు. ప్రజల ఆస్తులు కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. వీరికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళులన్నారు. సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ పిల్లా రాంబాబు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సూరిబాబు, నాయకులు జి.బాలిరెడ్డి, సాంబులు, పి.సూరిబాబు పాల్గొన్నారు.

మేస్త్రి ఓబుల్ రెడ్డిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఇఫ్టూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇఫ్టూ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఓబుల్ రెడ్డి మేస్త్రీపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురంలోని పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీపురం ఏరియా నాయకుడు ఓబుల్ రెడ్డి మేస్త్రిపై ఈ నెల 8వ తేదీన ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో కాపులపల్లి శ్రీనివాస రెడ్డి, ఆటో శ్రీనుతో పాటు 10 మంది కలిసి దాడి చేశారన్నారు. దాడిలో బ్లేడ్ బ్యాచ్ పాల్గొన్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి భవానీపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐతో చర్చించారు. సీఐ కేసులో ఉన్న వారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధర్నా కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, బీసీడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి షేక్ మీరావలి, జిల్లా సహాయ కార్యదర్శి పెద్ది రాజు, బ్రహ్మయ్య, ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతయ్య, ఓబుల్ రెడ్డి, అరుణోదయ శ్రీను, పీవోడబ్ల్యూయూ సిటీ అధ్యక్షురాలు షేక్ ఆసియా, రాముడు, మాలకొండయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి లేబర్‌కాలనీ వాసుల ఇక్కట్లు

అమృత్ పథకం పేరుతో గుంతలు తీసి వదిలేస్తున్న వైనం



కొత్త కనెక్షన్లు లీకవుతూ రోడ్డుమీదకు వస్తున్న తాగునీరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీవాసులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. ఇళ్లకు గతంలో ఇచ్చిన మంచినీటి కనెక్షన్ల స్థానంలో అమృత్ పథకం పేరుతో కొత్త కనెక్షన్లు ఇస్తామని చెబుతూ గుంతలు తీసి వదిలేస్తున్నారు. ఆయా గుంతల్లో మురుగునీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమల బాధ ఎక్కువై పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. అటు పాత, కొత్త కనెక్షన్ నుంచి నీళ్లు రాకపోవడంతో కాలనీవాసులు అల్లాడిపోతున్నారు. అమృత్ పథకం పేరుతో కొన్ని కొత్త కనెక్షన్లు ఇళ్లకు ఇచ్చినా అవికూడా సక్రమంగా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఇస్తున్న అమృత్ కనెక్షన్లు లీకులు మయంగా ఉందని అంటున్నారు.

దుర్వాసన, రంగుమారిన నీరు సరఫరా..

మంచినీరు వదిలిన సమయంలో ఆయా లీకుల కారణంగా ఇళ్లల్లోకి సరిగ్గా నీళ్లు రావడం లేదని చెబుతున్నారు. దీంతో కొంత మంది పాత కనెక్షన్స్ వైపే మొగ్గు చూపుతూ అమృత్ పథకం పేరుతో ఇచ్చిన కనెక్షన్‌ను తొలగించి గతంలో ఉన్న పాత కనెక్షన్‌కు వాటర్ పైప్‌ను బిగించుకుంటున్నారు. నగరంలో ఒక వైపు డయేరియా వ్యాధితో ప్రజలు ఆస్పత్రిపాలవుతుండగా కొత్త కనెక్షన్ కోసం తీసిన గుంతల్లో నిల్వ ఉన్న మురుగునీటిలో ఉన్న పైప్‌ల ద్వారా ఇళ్లల్లోకి వస్తున్న నీరు కలుషితం కాదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రంగుమారి, దుర్వాసన వస్తున్న నీటిని వినియోగిస్తున్నామని, ఇప్పుడు కొత్త కనెక్షన్ ద్వారా వచ్చే తాగునీరు సురక్షితమేనన్న నమ్మకం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తక్షణమే కొత్త కనెక్షన్ల లీకులను అరికట్టాలని, అలాగే వదిలేసిన గుంతలను పూడ్చేసి స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.


కొత్త చట్టాలతో షాపు ఉద్యోగులపై మరింత పనిభారం



సభలో మాట్లాడుతున్న బాబూరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కొత్త చట్టాల అమలుతో షాపులలో పనిచేసే ఉద్యోగులపై పనిభారం పెరిగిందని, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని షాపు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ బాబూరావు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ్ భవన్‌లో షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర 15వ మహాసభ జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఉన్న చట్టాలను మార్పు చేసి లేబర్ కోడ్‌లు తీసుకురావడం వలన కార్మికులు తమ హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పని గంటలు విపరీతంగా పెంచడంతో పాటు, సెలవు దినాల్లో కూడా బలవంతంగా పని చేయించుకొనే విధంగా చట్టాలు రూపొందించారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోందన్నారు. షాపుల్లో ఎక్కువ శాతం మహిళలు పనిచేస్తున్నారని, వారికి కనీస మౌలిక సదుపాయాలు, ఖాళీ సమయాల్లో షాపుల్లో కూర్చునే అవకాశం లేకపోవడం వలన వెరికోస్వెయిన్స్ వంటి దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. నగరంలో షాపింగ్ మాల్స్ పెరుగుతున్న నేపథ్యంలో కనీస సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, కనీస వేతనాలు అమలు చేసే విధంగా చట్టాలు చేయాలని, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు చేసినట్లు బిజినెస్ లేని సమయాల్లో కూర్చునే అవకాశం కల్పించే విధంగా చట్టాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, ఎంపీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లు



ఏపీసీపీడీసీఎల్ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడ తూర్పు): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా దసరా శరన్నవరాత్రులకు వీఎంసీ చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద, ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ప్రాంగణంలో హోల్డింగ్ ఏరియాను ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎటువంటి లోపం లేకుండా విజయవాడ నగర పాలక సంస్థ తాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత చెప్పుల స్టాండ్ వంటి ఏర్పాట్లు చేస్తోందని, 39 ప్రాంతాలలో 25 లక్షల వాటర్ బాటిల్స్, 35 లక్షల వాటర్ ప్యాకెట్స్‌ను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. 19 ప్రాంతాలలో 405 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని, ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 1490 మంది సిబ్బందితో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాలలో ఉచిత చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌లో వీఎంసీ ఏర్పాటు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు నివేదికలను సేకరిస్తామన్నారు. మౌలిక సదుపాయాలలో సమస్య ఉత్పన్నమయితే వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అందేటట్టు 24 గంటలు మూడు షిఫ్టలలో సిబ్బంది పనిచేస్తారని, వీటితోపాటు మోడల్ గెస్ట్ హౌస్‌లో శాఖల సమన్వయంతో అక్కడ కూడా సిబ్బంది మరోవైపు పని చేయటానికి ఏర్పాట్లు చేశారని చెప్పారు.

13 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో మండలాభిషేకం

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జూలై 26 నుంచి జూలై 31 వరకు పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన అష్టబంధన మహాసంప్రోక్షణ ముగిసిన సందర్భంగా వైఖానస సంప్రదాయం ప్రకారం ఈ నెల 13, 14 తేదీల్లో మండలాభిషేకం నిర్వహిస్తునట్లు ఆలయ పర్యవేక్షకుడు ఎం. మల్లికార్జునరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ శనివారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, అంకురార్పణ, 14 వ తేదీ ఆదివారం అగ్నిప్రతిష్టాపన, అష్టోత్తర శతకలశాభిషేకం, పూర్ణాహుతి నిర్వహిస్తునట్లు తెలిపారు.